ఆగని బియ్యం దందా

జిల్లాలో జోరుగా సాగుతున్నా కానరాని చర్యలు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. వినియోగదారుల నుంచి అక్రమార్కులు చౌకగా బియ్యం కొనుగోలు చేసి వాటిని ఇతరులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చౌకధరల దుకాణాల్లో బియ్యం పంపిణీ చేసే రోజుల్లోనే గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ తిరిగి కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల రేషన్ దుకాణాల వద్దే తిష్ఠ వేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పెద్ద వాహనాల్లో ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల నేరుగా చౌకధరల దుకాణాల నుంచే బియ్యం తరలిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇటీవల పట్టుబడ్డ బియ్యం సంచులను పరిశీలిస్తే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యాన్ని తీసుకెళ్లే గోనె సంచులు ఉండడం గమనార్హం. మెట్‌పల్లి సర్కిల్ పోలీసులు ఇటీవల కాలంలోనే సుమారు 190 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని నాలుగు ద్విచక్ర వాహనాలు, అయిదు నాలుగు చక్రాల వాహనాలను సీజ్ చేయడంతో పాటు తొమ్మిది మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం అక్రమ పీడీఎస్ బియ్యం దందా ఎక్కువగా కొనసాగుతుందనే ఆరోపణలకు బలం చేకూరుస్తుంది.

మెట్‌పల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఉన్న ఈ బియ్యం వివిధ చోట్ల పట్టుబడ్డవి. గత జులైలో 132.10 క్వింటాళ్లు, ఆగస్టులో 282 క్వింటాళ్ల పట్టుబడ్డ బియ్యాన్ని వేలం వేశారు. సెప్టెంబరులో సుమారు 163 క్వింటాళ్ల బియ్యం పట్టుబడగా, ఇక్కడ నిల్వ చేశారు. అక్టోబరులో ఇప్పటి వరకు 24 క్వింటాళ్లు పట్టుబడ్డాయి. మొత్తంగా ఇక్కడ ఇంకా 265.90 క్వింటాళ్ల పట్టుబడ్డ బియ్యం ఉన్నాయి. ఇవి



కేవలం దాడుల్లో పట్టుబడ్డవి మాత్రమే. ఈ లెక్కన ఇంకా అడ్డదారుల్లో రేషన్ బియ్యం ఎంత తరలిపోతుందో అర్థం చేసుకోవచ్చని పలువురు ఆరోపిస్తున్నారు.

తరలి పోతుందిలా..!

కిలోల చొప్పున సేకరించి క్వింటాళ్లుగా పోగు చేస్తున్న రేషన్ బియ్యం వివిధ చోట్లకు తరలిపోతున్నాయి. కొందరు మిల్లర్లు అక్రమ రేషన్ బియ్యం దందాను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతుండగా, ఆగస్టు నెలలో కోరుట్లలోని ఓ రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రేషన్ బియ్యాన్ని కోళ్లదాణా కోసం పౌల్ట్రీఫామ్‌లకు తరలిస్తున్నారు. బియ్యాన్ని నూకలుగా మార్చి కోళ్లదాణాగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు ఇబ్రహీంపట్నం మండలంలోని రెండు పౌల్ట్రీఫామ్‌లలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారు.

చూసీచూడనట్లుగా..

రేషన్ బియ్యం దందా వ్యవహారంపై కొందరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ మార్గాల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నా చెక్‌పోస్టులు లేకపోవడంతో అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇటీవల కేవలం పోలీసు అధికారులు మాత్రమే దాడులు జరిపి అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగాలు నిఘా పెడితే అక్రమ రేషన్ బియ్యం దందాను అరికట్టవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

పోలీసుల దాడులు ఇలా..

- కోరుట్లలోని బాలాజీ రోడ్డులో ఉన్న ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 352.2 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు.
- సెప్టెంబరు 11న మెట్‌పల్లి మండలం వేంపేట నుంచి ఆర్మూర్ వైపు టాటా మ్యాజిక్ వాహనంలో తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు.
- ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో రెండు పౌల్ట్రీఫామ్‌లలో నిల్వ ఉంచిన 125 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో శివారులో సెప్టెంబరు 12న వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు.
- మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు ఆటోలో తరలిస్తుండగా, అక్టోబరు 9న జగ్గాసాగర్ శివారులో 24 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిఘా పెడుతున్నాం



రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెడుతున్నాము. మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో పలుచోట్ల దాడులు చేసి సుమారు 400 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సంబంధిత అధికారులకు అప్పగించాము. తరలించేందుకు ఉపయోగించిన వాహనాలను కోర్టుకు అప్పగించాము. ప్రతి నెల 1 నుంచి 15 వరకు ఎక్కువగా అక్రమ రవాణా సాగుతుందని గుర్తించి పోలీస్ సిబ్బందితో నిత్యం నిఘా ఉంచుతున్నాము. గతంలో కంటే కొంత వరకు అక్రమ రవాణాను నియంత్రించాము. ఒకసారి పట్టుబడ్డ వారు మరోసారి పట్టుబడితే రూ.5 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేయడానికి చర్యలు తీసుకుంటాము. - **నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి సీఐ**

సబ్‌జడ్జి బాధ్యతల స్వీకరణ



జగిత్యాల: జగిత్యాల సబ్‌జడ్జిగా కె.వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్యశర్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల సబ్‌జడ్జి కె.ప్రసాద్ జిల్లా న్యాయసేవా అధికార సంస్థకు కార్యదర్శిగా బదిలీ కాగా జ్యుడిషియల్ అకాడమిలో ఉన్న శర్మను జగిత్యాలలో నియమించారు.

హత్య కేసు విచారణలో పురోగతి!

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి(58) హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన సంతోష్ అనే యువకుడు కారుతో ఢీకొట్టి కత్తితో హతమార్చిన ఘటన సంచలనం కలిగించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అదే రోజు నిందితుడు సంతోష్ పోలీసులకు లొంగిపోగా అతడికి సహకరించిన వారి వివరాల కోసం అరెస్టు ఆలస్యమైంది. గురువారమే నిందితుడిని రిమాండుకు తరలిస్తున్నట్లు పోలీసులు అంతా సిద్ధం చేసుకున్నప్పటికీ శుక్రవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ విషయంలో పోలీసులు స్పష్టమైన సమాచారం ఇవ్వనప్పటికీ ప్రాథమిక దర్యాప్తు దాదాపు పూర్తయినట్లు సమాచారం.

నిందితుడికి సహకరించింది ఎవరు?

నిందితుడు సంతోష్‌ను అన్ని కోణాల్లో వివిధ రకాల్లో పలు దఫాల్లో విచారించినప్పటికీ తాను ఒక్కడినే హత్య చేశానని, ఎవరూ సహకరించలేదని, కక్షతోనే హత్య చేసినట్టు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. అయితే కాల్‌డేటా ఆధారంగా గ్రామంలోని కొందరిని పిలిపించి విచారించినప్పటికీ వారి ప్రమేయం ఉందా లేదా అనేది ఇంకా తెలియరాలేదు. కొందరు సహకరించి హత్య చేయించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఈ కేసును సవాలుగా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. అయితే సంతోష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు మీడియా ద్వారా సమాచారం పొక్కిన నేపథ్యంలో ముందుగా రిమాండుకు పంపి ఆ తర్వాత కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకొని అన్నికోణాల్లో విచారించాలని ఆలోచనలో పోలీసులున్నట్లు సమాచారం. శుక్రవారం కచ్చితంగా అరెస్టు చూపే అవకాశాలున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

పెగడపల్లి, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి, రాజారాంపల్లి, నామాపూర్, రామభద్రునిపల్లి, అయితుపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ నాణ్యమైన, శుభ్రం చేసిన ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తరలించి సహకరించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా మిల్లర్లు కోత విధించడం ఉండదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ సీజన్ నుంచే ఎంపిక చేసిన సన్నరకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు శోభారాణి, రాజేందర్‌రావు, నాయకులు రామగౌడ్, తిరుపతి, మల్లారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



నామాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తులో వివిధ గ్రాంట్ల కింద మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జడ్పీ నిధులతో చేపట్టిన పనులపై సమీక్ష జరిపారు. ప్రారంభించిన పనులను వేగవంతం చేయాలని మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బి.సత్యప్రసాద్

పకడ్బందీగా పశుగణన

జిల్లాలో పశుగణన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా ఈనెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన చేపట్టి భారత్ పశుదాన్ పోర్టల్‌లో పొందుపర్చాలన్నారు. రెవెన్యూ గ్రామం యూనిట్‌గా లెక్కింపు జరపాలని జిల్లాలో 287 రెవెన్యూ గ్రామాలు, పట్టణాల్లోను 134 వార్డుల్లో లెక్కించేందుకు 115 మంది ఎన్యూమరేటర్లను నియమించామని మండలస్థాయిలో సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ప్రతి మండలానికి ఒక పశువైద్యాధికారి బాధ్యతలు అప్పగించామన్నారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.ఎల్.మనోహర్, ఉప పశుసంవర్ధక అధికారి డాక్టర్ బోనగిరి నరేష్, ఎంపీడీవోలు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలి

జిల్లాలోని అన్ని పట్టణాల్లో ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ దరఖాస్తులు ఆదివారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి బృందం కనీసం ప్రతిరోజు 20 దరఖాస్తులను పరిష్కరించాలని నీటిపారుదల, పరిశ్రమలకు సంబంధించిన భూములకు సంబంధించిన దరఖాస్తులను తిరస్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి, పురపాలక కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

1న జిల్లాకు బీసీ కమిషన్

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో నవంబర్ 1న బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం పర్యటిస్తుందని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజాభిప్రాయాలు తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో కరీంనగర్ కలెక్టరేట్‌లో నవంబర్ 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. సలహాలు, సూచనలు ఇచ్చే వారు నిర్దేశిత నమూనాలో 6 సెట్లు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎవరికి వారే!

'నేను నమ్ముకున్న నా కాంగ్రెస్ పార్టీ నుంచి నాకు అగౌరవం ఎదురవుతోంది. ఒకరకంగా ఇది నేను అవమానకరంగా భావిస్తున్నా. ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న పార్టీ వైఖరి వల్ల కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. నాలాంటి వాళ్లు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నా భవిష్యత్తు కార్యాచరణకు మీరే మార్గదర్శకం చేయగలరు.'

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకి రాసిన లేఖలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన



'జగిత్యాల అభివృద్ధే నా అజెండా. ప్రస్తుతం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా. అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటా. రోళ్లవాగు ప్రాజెక్ట్ నిర్మాణం సహా కీలకమైన ప్రగతి ఇంకా జగిత్యాలకు అందాలి. నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తా. ఫిరాయింపులతో హత్యలు జరుగుతున్నాయని విమర్శించిన వారి తీరును ఖండిస్తున్నాను. నేనేంటో ఇక్కడి ప్రజలకు తెలుసు.'

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

- రసవత్తరంగా జగిత్యాల రాజకీయం
- కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం

ఈనాడు, కరీంనగర్

జగిత్యాల కాంగ్రెస్‌లో రసవత్తర రాజకీయ పోరు సాగుతోంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డియే. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా పార్టీలో ఆయన నాయకత్వానికి మాత్రం ఎదురు లేదు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడం.. ఇద్దరు నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను కలవరపెడుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి పార్టీపై చేసిన విమర్శలు.. ఫిరాయింపులతో వచ్చిన నాయకుల వల్లే ఈ పరిస్థితి అని ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పరోక్షంగా ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారన్న అభిప్రాయం కలిగింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సందిగ్ధావస్థలో పడేసింది. పార్టీ పదేళ్ల తరవాత అధికారంలోకి వచ్చిందన్న ఆనందంలో ఉన్న సమయంలో ఈ పరిణామాలపై వారు కలవరపడుతున్నారు.

ఆవేదనలో జీవన్‌రెడ్డి..

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగా.. తాను ఓడిపోవడంతో నిరాశకు గురయ్యారు. తరువాత లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలవడంతో రాజకీయంగా మరింత ఇబ్బంది పడ్డారు. ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతుండటంతో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకెళ్తున్న ఆయన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భారాస నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో షాక్ తిన్నారు. తనపై గెలిచిన వ్యక్తిని పార్టీలో చేర్చుకుంటున్నపుడు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై కినుక వహించారు. పార్టీ పెద్దల వైఖరిని తప్పుబట్టిన ఆయన్ని మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు పార్టీ పెద్దలు బుజ్జగించారు. తరవాత పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొంటున్నారు. కానీ గతంలోలా తన అనుచరులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయన ముఖ్య అనుచరుడైన గంగారెడ్డి దారుణ హత్యకు గురవ్వడం ఆయనను తీవ్రంగా బాధపెట్టింది. ఈ క్రమంలోనే బాహాటంగానే పార్టీ వైఖరిని విమర్శించడం.. తాజాగా పార్టీ జాతీయాధ్యక్షుడికి లేఖరాయడంతో ఆయన రాజకీయ అడుగులెటు అన్న చర్చ సాగుతోంది.

కలవని చేతులు...

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఈ ఏడాది జూన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆయన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో నేరుగా కలిసిన సందర్భాలు ఒకట్రెండు మాత్రమే ఉన్నాయి. ఈ సందర్భంలోనూ వీరిద్దరు ఎడముఖం పెడముఖంగానే ఉన్నట్లు సమాచారం. ఒకే పార్టీలో ఉంటున్నా రాజకీయంగా ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్సీగా జీవనరెడ్డి తన పాత క్యాడర్‌తో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటుండగా.. ఎమ్మెల్యే హోదాలో డాక్టర్ సంజయ్ తన అనుచర వర్గంతో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటున్నారు. కానీ రాజకీయంగా ఎవరికి వారు పై చేయి సాధించాలనే వ్యూహాలు, ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల కొన్నిసార్లు ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలోనూ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య వివాదం రేగి ఫిర్యాదులు పోలీసు స్టేషన్ దాకా వెళ్లాయి. మరోవైపు కొన్ని గ్రామాల్లో రెండు వర్గాల పోరు ఇంతకింతకు పెరుగుతుండటం ఆ పార్టీ శ్రేణులను గందరగోళ స్థితిలో పడేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో ఎవరిది పై చేయి అవుతుంది.. ఎవరు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఎటువైపునకు దారితీస్తాయనేది రాజకీయ విశ్లేషకులకు కూడా అంతుచిక్కడం లేదు.



పట్టుతప్పితే ప్రమాదమే

కోరుట్ల పట్టణంలో అత్యంత రద్దీ గల జవహర్ రోడ్ ప్రమాదకరంగా మారింది. నెహ్రూ విగ్రహం నుంచి గ్రంథాలయం వరకు గతేడాది తారు రోడ్డును నిర్మించారు. రోడ్డుకు సమాంతరంగా మురుగు కాలువ ఎత్తును పెంచకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనాలు అదుపుతప్పి అందులోకి దూసుకువెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు కాలువ దెబ్బతిని కూలిపోతున్నా బల్దియా అధికారులు మరమ్మతులు చేయకుండా వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, కోరుట్ల**

గుంతల మయంగా ప్రయాణ ప్రాంగణం



జగిత్యాల పట్టణం కొత్తబస్టాండు ప్రయాణ ప్రాంగణం గుంతలమయంగా మారింది. ఎన్నిసార్లు మరమ్మతు చేపట్టినా తిరిగి గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇన్‌గేట్ నుంచి ఆవరణలోకి వచ్చిన బస్సులు, ప్రయాణికులతో బయలుదేరే దారిలో గుంతలు ఉండటంతో కుదుపులతోనే ప్రయాణం మొదలెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురికావడంతో నడుం నొప్పులున్నవారు, వృద్ధులు హడలెత్తిపోతున్నారు. దీనికి తోడు పరిమితికి మించి ఎత్తయిన స్పీడ్ బ్రేకర్లు, శిథిలమైన ఛాంబర్లతో ప్రాంగణం అస్తవ్యస్తంగా మారింది. సత్వరం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- **న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్**

విద్యార్థులకు విషయ పరిజ్ఞానం తప్పనిసరి

జగిత్యాల, న్యూస్‌టుడే: విద్యార్థులకు విషయ పరిజ్ఞానం తప్పనిసరని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, పనితీరు వివిధ అంశాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసులు, విధులు, పోలీసుస్టేషన్, శాంతిభద్రతల విషయంలో ప్రజలకు ఏవిధమైన సేవలు అందిస్తారనే విషయం కచ్చితంగా తెలుసుకోవాలని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణ, సీసీ కెమెరాలు, షీబృందాలు, సైబర్‌నేరాలు, ఆయుధాలు వాటి పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, రామక్రిష్ణ, వేణు, ఐటీ కోర్ డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రఫిక్‌ఖాన్, ఫింగర్ ప్రింట్స్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి గురువారం సాయంత్రం వరకు వరద 14,454 క్యూసెక్కులకు తగ్గటంతో స్పిల్‌వే గేట్లను మూసివేశారు. అన్ని కాలువలు, ఎత్తిపోతల పథకాలు కలుపుకొని ఇన్‌ఫ్లో మేరకు ఔట్‌ఫ్లో ఉండగా ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ కొనసాగిస్తున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారిద్దామని మెట్‌పల్లి సీనియర్ సివిల్ న్యాయమూర్తి డి.నాగేశ్వర్‌రావు అన్నారు. మెట్‌పల్లి సబ్‌కోర్టులో గురువారం సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. బార్, బెంచ్ మధ్య స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తానన్నారు. కోర్టులో అన్ని రకాల సౌకర్యాల కల్పనకు సహకరిస్తానన్నారు. మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిద్దామని చెప్పారు. అంతకు ముందు ఆయనకు న్యాయవాదులు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.



కంకర తేలి అధ్వానంగా రేగుంట-వెంపల్లి పంచాయతీ రహదారి



మల్లాపూర్-మొగిలిపేట రహదారిలో..

నిధులు మంజూరైనా..

గతుకులమయంగా గ్రామీణ రహదారులు

న్యూస్‌టుడే, మల్లాపూర్

మల్లాపూర్ మండలంలోని పంచాయతీ రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రేగుంట-వెంపల్లి రహదారికి ఏడాది కిందట రూ.55 లక్షలు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో రాయికల్‌కు చేరుకోవడానికి వెంపల్లి, వెంకట్రావుపేట, జగన్నాథపూర్‌లకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మల్లాపూర్ మండల కేంద్రం నుంచి మొగిలిపేట, రత్నాపూర్, గుండంపల్లి వెళ్లేందుకు గతంలో నిర్మించిన రహదారులకు కనీస మరమ్మతు చేపట్టాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మల్లాపూర్ మండల కేంద్రం నుంచి గుండంపల్లి వెళ్లే రహదారికి నిధులు మంజూరు కాగా పనులు చేపట్టిన గుత్తేదారు కంకర వేసి వదిలేయడంతో రహదారిపై ప్రయాణమంటేనే ప్రజలు జంకుతున్నారు. పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం కాకపోవడం, గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెడిపోయిన కల్వర్టుల స్థానంలో ఇటీవల నిధులు మంజూరైనప్పటికీ పనులు ముందుకు సాగడంలేదు. గొర్రెపల్లి-వాల్గొండ రహదారికి మూడేళ్ల కిందట రూ.2.40 కోట్లు మంజూరైనప్పటికీ అటవీశాఖ అడ్డంకితో కల్వర్టులు నిర్మించినప్పటికీ రహదారుల నిర్మాణం నిలిచిపోయింది. మల్లాపూర్-మొగిలిపేట గ్రామాల మధ్య బీటీ రహదారికి సైతం నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది.



మల్లాపూర్-గుండంపల్లి మార్గంలో కంకరను వేసి బీటీ మరిచిన అధికారులు

పెరుగుతున్న భూ వివాదాలు

◆ విక్రయించిన వ్యవసాయ భూములకు పాసుపుస్తకాలు
◆ ఇళ్ల స్థలాలకూ రెండు, మూడుసార్లు రిజిస్ట్రేషన్లు



■ కొండగట్టు ప్రాంతంలో హాట్ రోడ్డు పక్కన నిర్మించిన దుకాణ భవన సముదాయంలోని గదులను ఓ స్థిరాస్తి వ్యాపారి ఒక్కో గదిని రూ.5 లక్షల వరకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించినట్లు పలువురు బాధితులు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కొండగట్టుకు చెందిన మరో వ్యక్తి తనకు చెందిన ఓ ప్లాటును ముగ్గురు వ్యక్తుల పేర విక్రయించడంతో పోలీసులు సదరు వ్యక్తిపై మోసం కేసు నమోదు చేశారు. ఈ విధంగా కొండగట్టు ప్రాంతంలో పలువురు వ్యక్తులు అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

న్యూస్‌టుడే, మల్యాల

జగిత్యాల జిల్లాలో భూవివాదాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. కొందరు స్థిరాస్తి వ్యాపారులు, దళారులు మాయాజాలంతో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో చాలా ఏళ్ల కిందట విక్రయించిన భూములను తాము విక్రయించలేదని పేర్కొంటూ కొందరు వ్యక్తులు గొడవలకు దిగుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మల్యాల మండలంలోని ముత్యంపేట, కొండగట్టు, బల్వంతాపూర్, మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం తదితర గ్రామాల పరిధిలోని భూములకు డిమాండు ఏర్పడటంతో కొందరు వ్యక్తులు తాము విక్రయించిన భూమిని మళ్లీ మరో వ్యక్తికి విక్రయించడంతో వివాదాలకు దారితీస్తోంది. రాజకీయ నాయకులు కూడా భూముల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌తో మోసాలకు పాల్పడుతున్నారు.

■ మల్యాల అడ్డరోడ్డు, నూకపల్లి, రాజారం శివారులోని వ్యవసాయ భూములు ఇళ్లప్లాట్లకు అనుకూలంగా ఉండటంతో పట్టణ ప్రాంతాలకు చెందిన వైద్యులు, బడా వ్యాపారులు ఎకరాకు రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. భూములను రిజిస్ట్రేషన్ చేసుకొన్నప్పటికీ మళ్లీ భూ యజమానులు అది తమ తాతల నాటి భూమి అని దానిని తాము విక్రయించలేదని పేర్కొంటూ నకిలీ దస్త్రాలు సృష్టించి కొత్తగా రెవెన్యూ అధికారుల నుంచి పాసు పుస్తకాలు పొందుతుండటం పెద్ద సమస్యగా మారుతోంది.

■ భూములు కొనుగోలు చేసి తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు సదరు భూమిని రెవెన్యూ కార్యాలయంలో మ్యుటేషన్ అమలు చేసి కోపోతే నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని దళారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ విధంగా మల్యాల మండలంలో పదుల సంఖ్యలో ఇటీవలే భూవివాదాలు పోటెత్తుతున్నాయి. గతంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేసిన కొందరు వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర వ్యక్తులకు చెందిన భూములను వారికి తెలియకుండా తమ పేర లేదా కుటుంబ సభ్యుల పేర నమోదు చేయడంతో బాధితులు ఇప్పటికీ న్యాయం చేయాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

మోసాలకు పాల్పడేవారిపై చర్యలు

భూములకు సంబంధించి సరైన పత్రాలు కలిగి ఉండి, మోఖాపై ఉండే వ్యక్తుల భూముల ఆక్రమణకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మోసాలకు పాల్పడే వ్యక్తులపై కేసు నమోదు చేయడంతోపాటు ఇప్పటికే అసలైన భూయజమానులకు రక్షణ కూడా కల్పిస్తాం. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపులా భూములకు రేట్లు అధికంగా ఉండటంవల్ల ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడి పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం.

- నీలం రవి, మల్యాల సీఐ

అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చూస్తాం

మల్యాల మండలంలో కొందరు అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు, మరి కొందరు తమ భూమిని విక్రయించినా తాజాగా పాసుపుస్తకాలు పొందినట్లు మా దృష్టికి రావడంతో చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రిజిస్ట్రేషన్ల గురించి మా దృష్టికి తీసుకొస్తే విచారణ చేస్తాం. గతంలో ధరణిలో ఒక రిజిమి మరొకరి పేర రిజిస్ట్రేషన్ చేశారు. ఈసీ పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

- మునీందర్, తహసీల్దారు, మల్యాల

రూ.500 బోనస్ ఇచ్చే సన్నరకాలు

ప్రభుత్వం ప్రకటించిన వంగడాలు




న్యూస్‌టుడే, గంగాధర

ఎన్నికల హామీలో భాగంగా క్వింటాలు సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని రాష్ట్ర సర్కారు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏ రకం వంగడాలకు బోనస్ వస్తుందోనని సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతోంది. వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వం 33 రకాల వంగడాలను గుర్తించింది. మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఈ మేరకు ఫ్లెక్సీలు ప్రదర్శిస్తారు. అయితే జై శ్రీరామ్ సూపర్ ఫైన్ రకం ప్రభుత్వం గుర్తించిన వంగడాల్లో లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి ఈ రకం ధాన్యానికైనా, బియ్యానికైనా మార్కెట్‌లో మంచి డిమాండు ఉంది. ప్రభుత్వం అందించే మద్దతు ధర, బోనస్‌కు అదనంగా రైస్‌మిల్లర్లు చెల్లించి కొనుగోలు చేస్తారు. లేదా ధాన్యం మర పట్టించి బియ్యం అమ్మినా అంతకు రెట్టింపు ధర రైతులకు గిట్టుబాటు కానుంది. గింజ పరిమాణం కొలిచి నాణ్యమైన ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు. ఒకవేళ జాబితాలో లేకున్నా జైశ్రీరామ్ రకంవి తెస్తే.. కొనుగోలు చేస్తామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాల్లో సేకరించే ధాన్యం రకం

- సిద్ధి (డబ్ల్యూజీఎల్ 44)
- కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)
- సాంబ మసూరి (బీపీటీ-5204)
- జగిత్యాల వరి-3 (జేజీఎల్ 27356)
- జగిత్యాల వరి-2 (జేజీఎల్ 28545)
- వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14)
- వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100)
- జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470)
- పొలాస ప్రభ (జేజీఎల్ 384)
- క్రిష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)
- మానేరు సోనా (జేజీఎల్ 3828)
- తెలంగాణ సోనా (ఆర్ఆఎన్ఆర్ 15048)
- వరంగల్ వరి- 1119
- కూనారం వరి-02 (కేఎన్ఎం 1638)
- వరంగల్ వరి-02 (డబ్ల్యూజీఎల్ 962)
- రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్ 21278)
- కూనారం వరి-1 (కేఎన్ఎం 733)
- జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)
- జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)
- కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855)
- అంజన (జేజీఎల్ 11118)
- నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)
- ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)
- సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
- శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
- సోమ్‌నాథ్ (డబ్ల్యూజీఎల్ 347)
- ఆర్ఎన్ఆర్ 31479 (పీఆర్‌సీ)
- కేపీఎస్ 6251 (పీఆర్‌సీ)
- జేజీఎల్ 33124 (పీఆర్‌సీ)
- హెచ్ఎంటీ సోనా
- మారుతేరు సాంబ (ఎంటీయు 1224)
- మారుతేరు మసూరి (ఎంటీయు 1262)
- ఎంటీయు 1271

మళ్లీ నురగ... కలుషిత జలాలతో బెంగ




గోదావరిఖని కోల్‌బెల్ట్ వంతెన వద్ద నదిలో తేలిన నురగ

పవిత్ర గోదావరినదిలో నీటిపై నురగ మళ్లీ పేరుకుంటోంది. ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేయడంతో దిగువకు రెండు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం లేకుండా ఎండిపోయి ఉన్న గోదావరినదిలో ప్రస్తుతం జలకళ సంతరించుకున్నప్పటికీ గురువారం ఉదయం నీటిపై నురగ తేలడంతో పవిత్ర స్నానాలకు వెళ్లే వారు ఆందోళనకు గురయ్యారు. గోదావరినది పరిసర ప్రాంతాల నుంచి కలుషిత జలాలు నదిలో చేరడం వల్లే నీటిపై నురగ తేలుతుందని స్థానికులు అంటున్నారు. నగరంలో వినియోగించిన నీటితో పాటు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు నేరుగా నదిలో చేరడం వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని అంటున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమకు చెందిన రసాయన వ్యర్థాలు సైతం నేరుగా గోదావరినదిలోకి చేరడంతో నురగ వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గోదావరినది పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోదావరిఖని

పట్టభద్రులూ మేల్కోండి

ఓటరు నమోదుకు కదలండి ◆ మరో 13 రోజులే గడువు





న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్, వెల్గటూరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి ఎన్నికల ప్రచార సందడి రోజురోజుకు పెరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం ముమ్మరం చేశారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలుస్తూ.. ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కానీ ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండటంతో 13 రోజులే మిగిలి ఉంది. ఇకనైనా అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు నమోదుకు కదలాల్సిన అవసరముంది.

నమోదు కేంద్రాలు వెలవెల..


జిల్లాల్లోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. అయినా ఆదరణ అంతంతా మాత్రంగానే ఉంటోంది. దీపావళి పండగ అనంతరం నమోదు ప్రక్రియ వేగం పుజుకోనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కరీంనగర్ గ్రామీణ మండల రెవెన్యూ కార్యాలయంలో ఓటరు నమోదు బ్యానర్

ఉపాధ్యాయుల్లోనూ స్పందన అంతంతే..

సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారు నమోదులో ముందుంటారని ఎవరైనా భావిస్తుంటారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గాలు ఆసక్తి చూపడంలేదని తాజా గణాంకాలను చూస్తే తెలుస్తోంది. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు అందజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులందరూ దరఖాస్తు సమర్పించాలి. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయులు 1761, పట్టభద్రులు 66,743 ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.



ఓటరుగా ఎవరు నమోదు చేసుకోవచ్చు..

పట్టభద్రులు ఓటు నమోదు (ఫారం-18 చేసుకోవాలంటే) 2021 అక్టోబరు 31 వరకు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులైతే 2018 నవంబరు వరకు మూడేళ్లకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పని చేసి ఉండాలి. వారు ఫారం-19తో ఓటరు నమోదు చేసుకునే వీలుంటుంది. చరవాణిలోనూ.. ఉన్న చోట నుంచే ఓటరు నమోదు చేసుకునే అవకాశం సైతం ఎన్నికల కమిషన్ కల్పించింది. అందుకు www.ceotelangana.nic.in వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది. పట్టభద్రులు ఫారం-18, ఉపాధ్యాయులైతే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే మీరు ఓటరుగా నమోదైనట్లే.

ఎమ్మెల్యే గంగులకు కేటీఆర్ పరామర్శ



ఎమ్మెల్యే కమలాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

రాంపూర్(కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మరణించడంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ ఆయన్ను గురువారం పరామర్శించారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమలాకర్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతిపై వారికి సానుభూతి తెలియజేశారు. కమలాకర్‌తోపాటు పలువురు నాయకులతో కాసేపు కేటీఆర్ మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జడ్పీ ఛైర్‌పర్సన్ వసంత, మాజీ ఎమ్మెల్యేలు రసమయి, రవిశంకర్, బాల్క సుమన్, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు హరిశంకర్, జడ్పీ మాజీ ఛైర్మన్ తుల ఉమ, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు కమలాకర్‌ను పరామర్శించారు. అనంతరం కేటీఆర్, ఎమ్మెల్యేలు, నాయకులు కమలాకర్ ఇంట్లో భోజనం చేశారు. అనంతరం కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు.

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

జమ్మికుంట : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 172 ట్రాలీల విడి పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో కనిష్ఠంగా రూ.6,500 గరిష్ఠంగా రూ.6,750 ధర పలికింది. 32 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.6,400 దాకా ధర పలికింది. బుధవారం కంటే తాజాగా పత్తి ధర రూ.50 తగ్గింది. తేమ శాతంతో ధర తగ్గిందని మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. బిడ్డింగ్‌ను మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా పరిశీలించారు. స్థానిక మార్కెట్‌లో సీసీఐ 4 ట్రాలీల పత్తిని ఖరీదు చేసిందని ఆయన చెప్పారు.

దళారుల చేతిలో పత్తి రైతుల దగా



ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాన్‌లో నింపిన పత్తి

న్యూస్‌టుడే, వేములవాడ

పత్తి రైతులు గ్రామాల్లో దళారుల చేతిలో మోసాలకు గురవుతున్నారు. ఇప్పటికే మొదటి దఫా పత్తి సేకరణ చేసిన రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కాంటాలు పెట్టి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 42,390 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేయగా 30,028 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే జిల్లాలో పత్తి సేకరణ ఊపందుకుంది. ఇప్పటికే జిల్లాలోని చాలా గ్రామాల్లో రైతుల వద్ద దళారులు తక్కువ ధరకు భారీ ఎత్తున పత్తి కొనుగోలు చేస్తూ ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు.

సీసీఐ కేంద్రాల ఏర్పాటుతోనే ప్రయోజనం

భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఇంకా జిల్లాలో ప్రారంభించకపోవడంతో దళారులకు కలిసొస్తుంది. ఇదే అదనుగా పత్తి రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనం కలగనున్నది. జిల్లాలో సుద్దాల, నాంపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, తాళ్లపల్లి ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. 8 నుంచి 12 శాతం తేమతో ఉన్న పత్తికి సీసీఐ క్వింటాల్‌కు రూ.7,521 నుంచి రూ.7,421 వరకు పింజ పొడవును బట్టి ధరను చెల్లిస్తుంది. గ్రామాల్లో దళారులు తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి రూ.6 వేల నుంచి రూ.6,200లకే కొంటున్నారు. పత్తి విక్రయానికి రైతులకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు చెప్పిందే ధర అన్న చందంగా మారింది. దీంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో క్వింటాల్ పత్తికి నాణ్యతను బట్టి రూ.6,500ల వరకు చెల్లిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం

జిల్లాలో అయిదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ద్వారా అగ్రిమెంట్ జరిగింది. పత్తి రైతులు తొందరపడి దళారులకు విక్రయించి మోసపోవద్దు. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి కనీస మద్దతు ధర పొందాలి.

- ప్రకాశ్, జిల్లా మార్కెట్ శాఖ ఇన్‌ఛార్జి అధికారి

తూకాల్లోనూ మోసాలు

గ్రామాల్లో దళారులు తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, దళారులు క్వింటాల్‌కు దాదాపు రెండు నుంచి మూడు కిలోలను దోచుకుంటున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా పత్తి సాగుకు పెట్టుబడులు పెరిగి పోతున్నప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రాక నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఎక్కువ ధర ఆశ చూపి దళారులు తూకంలో మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బండ రాళ్లు, పత్తి బోరాలు ఎత్తుగా వేసి తూకాలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసే దళారులపై తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో దళారులు ఇష్టారాజ్యంగా రైతుల వద్ద కొనుగోలు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా రైతులను దోపిడీకి గురి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఆరోగ్యానికి మిద్దె సాగు

■ పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఇంటి పరిసరాలు

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి ఇలా అన్నీ కలుషితం అవుతుండడం.. వాటిని తిన్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది సొంతంగా మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు పెంచుతూ డబ్బుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

మెట్‌పల్లి పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన



లాస్య-రంజిత్ దంపతులు

చిటికేసి రంజిత్-లాస్య ఇల్లు మొక్కలతో పచ్చదనంగా మారింది. లాస్యకు చిన్ననాటి నుంచి మొక్కలంటే ఎంతో మక్కువ. ఉదయం, సాయంత్రం సమయాన్ని కేటాయిస్తూ వివిధ రకాల మొక్కలను పెంచుతుంది. మిద్దెపై పండ్లు, పూలతో పాటు వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ఇంటికి వినిగించుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటున్నారు. మిద్దెపై ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసుకొని జామ, అంజీరా, మామిడి, దోస, సపోట, పండ్ల మొక్కలతో పాటు టమాట, చిక్కుడు, బీర, సోర, కాకర, పొట్లకాయ, మిరపకాయ, బెండ, వంకాయ లాంటి కూరగాయలతో పాటు వివిధ రకాల గులాబీ, గన్నేరు, మల్లే, చామంతి, బంతి పూల మొక్కలను పెంచుతున్నారు. ఇంట్లో వాడి పడేసిన నూనే డబ్బాలు, వాటర్ బాటిళ్లతో పాటు వివిధ ప్లాస్టిక్ డబ్బాలను సేకరించి వాటికి రంగులు వేసి మొక్కలను పెంచుతూ వాటిని ఇంటి ముందు వేలాడదీశారు. నిత్యం ఇంట్లో వెలువడే కూరగాయలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఎరువును మొక్కలకు అందిస్తుండడంతో రసాయన ఎరువుల వినియోగం లేకుండా మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో ఇంట్లో లభించే వాటితో డబ్బులు ఆదా చేసుకుంటున్నారు.



మిద్దెపై పండ్లు, పూలు, కూరగాయల మొక్కలు



కబడ్డీలో తలపడుతున్న సిరిసిల్ల-వీణవంక జట్లు

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జరుగుతున్న బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్‌లో కబడ్డీలో సిరిసిల్ల, వీణవంక జట్లు తలపడగా సిరిసిల్ల జట్టు గెలుపొందింది. ఖోఖోలో కొత్తపల్లి, సైదాపూర్ తలపడగా కొత్తపల్లి జట్టు, వాలీబాల్‌లో స్తంభంపల్లి, గంగాధర తలపడగా స్తంభంపల్లి జట్టు గెలుపొందాయి. లాంగ్ జంప్‌లో సైదాపూర్, వీణవంక పాఠశాలల విద్యార్థులు సాయిచరణ్, కౌశిక్‌లు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. విజేతలను పాఠశాల ప్రధానాచార్యులు జక్కని రాజేశం, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.





ప్రతిభతో మెరిశారు.. ప్రశంస పొందారు

'ఈనాడు' ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని గౌతమ్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం-యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచ పోటీలో విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు ఎన్.రిషేందర్, వనియా నాజ్, సిహెచ్ రేన్యూకు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ ఎండి గఫ్ఫార్, ప్రిన్సిపల్ ఎం.గోపి, ఎండి కేజేర్, అఫ్రోజ్, శ్రీనివాస్, షఫీ, రాజు జైస్వాల్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కోరుట్ల

నైపుణ్యం చాటి.. బహుమతి పొంది



'ఈనాడు' ఆధ్వర్యంలో జగిత్యాల గోవిందుపల్లెలోని గౌతమ్ హైస్కూలు విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం-సామాజిక మాధ్యమాలతో విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ఎం.నాగరాజు, ఇ.సంజన, ఎ.అభిరామ్‌లకు హెచ్‌ఎం కె.అన్నపూర్ణ బహుమతులు అందించారు. కె.కవిత, పి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు



మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

సమస్య: మహాలక్ష్మీనగర్‌లో చెత్తను తరలించే వాహనాలు సక్రమంగా రావటంలేదు. - **శ్రీరాములు**

సమాధానం: జగిత్యాల పురపాలక సంఘానికి 10 చెత్త ఆటోలు రాగా బుధవారం ప్రారంభించాము. మరో 6 ఆటోలు రావాల్సి ఉంది. - **చిరంజీవి, కమిషనర్, జగిత్యాల పురపాలక సంఘం**

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

సమస్య: ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. - **కృష్ణ, నరేష్, ఇందిరా ప్రియదర్శినికాలనీ, హనుమాన్‌నగర్**

సమాధానం: సమాచారం అందిస్తే ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయిస్తాం. - **మోహన్, కమిషనర్, మెట్‌పల్లి**

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి



గుల్లపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. జగిత్యాల గ్రామీణ మండలం గుల్లపేట, పొరండ్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్, అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

బుగ్గారం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం బుగ్గారం మండలంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఆదేశించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కోల్పోతున్న భూములు, ఇండ్లు, కట్టడాలు తదితర వాటిని పరిశీలించి నష్టపరిహారం అంచనా నివేదికలను తయారు చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, రెవెన్యూ, అటవీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చరవాణి మితిమీరి వాడొద్దు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకునే సమయంలో చరవాణిని మితిమీరి వాడవద్దని, అవసరం ఉన్నంత వరకే వినియోగించాలని విద్యార్థులకు పోలీసులు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం ఠాణాలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి, విద్యార్థులకు ఠాణాలోని పలు గదుల గురించి, రికార్డుల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో.. విద్యతో కూడిన చరవాణి వాడకం అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఎస్సై అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం డ్రగ్స్‌పై విద్యార్థులకు ఎస్సై చిరంజీవి అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, ప్రిన్సిపల్ సంతోష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు

కోరుట్ల: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని అన్ని విభాగాలు విద్యార్థులు పరిశీలించి వాటి గురించి తెలుసుకున్నారు. ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది మధుకర్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



మెట్‌పల్లి పట్టణం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

మల్లాపూర్: పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం 100 డయల్‌పై ఇంటర్ విద్యార్థులకు ఎస్సై కిరణ్‌కుమార్ అవగాహన కల్పించారు. షీ టీమ్స్, నేరాలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

ఖర్గేకు జీవన్‌రెడ్డి లేఖపై పీసీసీ స్పందిస్తుంది

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు జీవన్‌రెడ్డి రాసిన లేఖపై తాను ఏమీ స్పందించనని, పీసీసీయే స్పందిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన 'ఈటీవీ, న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని.. అవసరమైతే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకుంటానని.. చెప్పారు. తాను భారాసకు రాజీనామా చేయని మాట వాస్తమేనని అన్నారు. కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి హత్య నేపథ్యంలో జగిత్యాలలో రాజకీయం వేడెక్కిన నేపథ్యంలో గురవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడుతున్నారని, ఆయన కూడా తెదేపా నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన వారే అన్నారు. తాను పరిస్థితులను బట్టి ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో పనులు పెండింగ్‌లో ఉండటంతో నిధులు, అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని అన్నారు. ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి ఫిరాయింపులతో హత్యలు జరుగుతున్నాయని విమర్శించటాన్ని ఖండిస్తున్నానని అన్నారు. తనను, పార్టీలో కొందరిని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఆయన అలా మాట్లాడుతున్నారని అన్నారు. ఆయన ఇకనైనా విమర్శలు మానుకుని కలిసి అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. గంగారెడ్డి హత్యపై జిల్లా ఎస్పీతో మాట్లాడానని విచారణ చేయాలని కోరానని అన్నారు.

రాయికల్ ఆసుపత్రి విస్తరణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: రాయికల్ సామాజిక ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని, ఆసుపత్రి విస్తరణకు తన వంతు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. సాధారణ ప్రసవాలకే వైద్యులు ప్రాముఖ్యం ఇవ్వాలన్నారు. 317 జీవో ద్వారా తమకు అన్యాయం జరిగిందని నర్సింగ్ సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్, పుర అధ్యక్షుడు హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్ పాల్గొన్నారు.

సత్వర న్యాయ కల్పనతోనే భరోసా



మొక్కకు నీరుపోస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఫిర్యాదు చేసిన బాధితులకు సత్వరమే న్యాయం కల్పించినప్పుడే పోలీసులపై పూర్తి స్థాయిలో భరోసా ఏర్పడుతుందని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం బీర్‌పూర్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్కను నాటి, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై కుమారస్వామి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహ్రెయిన్‌లో వేంపేట వాసి ఆత్మహత్య



సుధీర్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లిన వలసజీవి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మెట్‌పల్లి మండలం వేంపేటలో విషాదం నింపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపేటకు చెందిన మారంపల్లి సుధీర్(35) బతుకుదెరువు కోసం అప్పు చేసి పదేళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. రెండున్నరేళ్ల నుంచి బహ్రెయిన్ వెళ్లి అక్కడ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అప్పులు తీర్చాలని ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో తన గదిలో బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. దీంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సుధీర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహం త్వరగా రప్పించేలా చూడడంతో పాటు ప్రభుత్వపరంగా ఆదుకునేలా చూస్తానని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చిర్ర అభి

మల్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం నాచుపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామానికి చెందిన చిర్ర అభి(19) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు సమీప బంధువులు తెలిపారు. ఈనెల 20న మల్యాల మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన రాము, బల్వంతాపూర్ గ్రామానికి చెందిన అభి ద్విచక్రవాహనంపై కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అభి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో బల్వంతాపూర్‌లో విషాదం నెలకొంది.

పారిశుద్ధ్య కార్మికుడికి తీవ్రగాయాలు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం ముందున్న రేకుల షెడ్డుపై నుంచి జారిపడటంతో దినసరి వేతన పారిశుద్ధ్య కార్మికుడు లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డట్లు శానిటరీ ఇన్‌స్పెక్టరు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఓ భక్తురాలి ఆధార్‌కార్డును కోతి ఎత్తుకెళ్లడంతో లక్ష్మణ్ దానిని తీసుకురావడానికి ఆలయం ముందున్న రేకులషెడ్డుపైకి ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో చేయి విరగడంతోపాటు నడుముకు తీవ్రగాయాలైనట్లు వివరించారు. కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

మోసం చేసి పరారైన వ్యక్తికి రిమాండ్

జగిత్యాల, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఫైనాన్స్, చీటీల పేరుతో పలువురి నుంచి డబ్బులు తీసుకొని పరారైన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన గాండ్ల వెంకన్న 2023లో జగిత్యాల, పలు గ్రామాల్లో పలువురి వద్ద చీటీల పేరుతో డబ్బులు వసూలు చేసి నగదు ఇవ్వకుండా మోసం చేసి పరారయ్యాడు. బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం వెంకన్నను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పట్టణ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన భారాస శ్రేణులు



మెట్‌పల్లిలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మెట్‌పల్లిలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆదిలాబాద్‌లో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న ఆయన గురువారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి మెట్‌పల్లి మీదుగా కరీంనగర్ వెళ్తుండగా, మార్గమధ్యలో స్థానిక శాస్త్రిచౌరస్తాలో స్వాగతం చెప్పారు. కార్యకర్తలు ఉత్సాహంతో నినాదాలు చేశారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఒజ్జల శ్రీనివాస్, ఆకుల రాజరెడ్డి, కందరి ప్రతాప్‌రెడ్డి, గోపిడి జగన్మోహన్‌రెడ్డి, పలు ప్రాంతాల కార్యకర్తలున్నారు.



మల్యాలలోని ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చివేయిస్తున్న ఎస్సై

రహదారిపై గుంతలకు మరమ్మతు

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల అడ్డరోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై పలు చోట్ల వర్షాలకు గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎస్సై నరేష్ గురువారం మరమ్మతు చేయించారు. కంకర చిప్స్, పొడితో పూడ్చివేయించి చదును చేయించారు. ఆర్అండ్‌బీ అధికారులు చేయించాల్సిన మరమ్మతు పనులను పోలీసులు రెండోసారి చేయించడం హర్షణీయమని స్థానికులు తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

మేడిపల్లి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని వేములవాడ నియోజకవర్గ భాజపా నాయకుడు చెన్నమనేని వికాస్ అన్నారు. గురువారం మేడిపల్లి, భీమారం మండలాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. భాజపా సభత్వ నమోదులో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ప్రతి బూత్ స్థాయి కార్యకర్త కృషి చేస్తే రెట్టింపవుతుందని పేర్కొన్నారు. క్యాతం దశరథ రెడ్డి, ముంజ శ్రీనివాస్, అన్నాడి జలపతి రెడ్డి, మకిలి ఇజ్రాయిల్, చిట్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో చెన్నమనేని వికాస్, ఇతరులు

నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. గురువారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోకపోతే ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పుకొని గాంధీభవన్‌కు ఎందుకు వెళ్లినట్లు అని ప్రశ్నించారు. మారు గంగారెడ్డిని భారాసకు చెందిన వ్యక్తి హత్య చేశాడని ఎమ్మెల్సీ మాట్లాడటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సతీష్, ఆనంద్‌రావు, కౌన్సిలర్ దేవేందర్‌నాయక్, శీలం ప్రియంక తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ముందుకెళ్తేనే విజయం

కోరుట్ల: విద్యార్థులు పట్టుదలతో ముందుకెళ్తేనే విజయం సాధించగలుగుతారని ప్రిన్సిపల్ గౌసుర్ రెహమాన్ అన్నారు. గురువారం కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిళ్ల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆర్టీసీలో వైద్యపరీక్షలు

మెట్‌పల్లి పట్టణం: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఆర్టీసీ డిపోలో గురువారం ఉద్యోగుల జీవిత భాగస్వామి (భార్య)కు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. కరీంనగర్ ఆర్ఎం సుచరిత పరిశీలించారు. డిపో మేనేజర్ దేవరాజ్, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీలు.. జరిమానా

కోరుట్ల : కోరుట్ల పట్టణంలోని టిఫిన్ సెంటర్లు, స్వీట్‌హౌజ్‌లు, బేకరీలలో బల్దియా అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వంట పాత్రలు, నూనే, ఇతర పదర్థాలను శుభ్రంగా ఉంచనందుకు రూ.12,500 జరిమానా విధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.

విధులకు హాజరైన ఏఈవోలు

జగిత్యాల వ్యవసాయం: జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులు గురువారం విధులకు హాజరయ్యారు. డిజిటల్ క్రాప్ సర్వే మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఏఈవోల సస్పెన్షన్ ఎత్తివేత, వేతనం చెల్లింపు, ఇతరత్రా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈవోల సంఘం జిల్లా నాయకులు సురేందర్ నాయక్, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు కోరారు.

బీటులో ఉత్పత్తుల కొనుగోలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల బీటులో గురువారం మక్కలకు క్వింటాలుకు రూ.1,850 నుంచి రూ.2,446 ధర పలికింది. జైశ్రీరాం రకం ధాన్యానికి రూ.2,502, ఎంటీయూ1010 రకం రూ.1,821 నుంచి రూ.1,920 వరకు ధరలు పలికినట్లు అధికారులు తెలిపారు.

26న మల్యాలలో బీడీ కార్మికుల జిల్లా మహాసభ

జగిత్యాల వాణిజ్యం: ఏఐటీయూసీ అనుబంధ బీడీ కార్మికుల జిల్లా మహాసభను ఈ నెల 26న మల్యాలలో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు శ్రీగాధ దేవదాసు, మునుగురి హనుమంతు, వెన్న మహేశ్ తెలిపారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్యాల: మల్యాల మండలం సర్వాపూర్ వరద కాలువ పక్కన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మల్యాల సింగిల్‌విండో అధ్యక్షుడు రాంలింగారెడ్డి ప్రారంభించారు. ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆనందరెడ్డి, రాయమల్లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

శ్రీరామసాగర్ కాల్వనీటితో పంటల మునక

రాయికల్: శ్రీరామసాగర్ కాల్వకు పడిన గండ్లతో రాయికల్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో వరి పంట పొలాలు మునిగిపోతున్నాయి. కోత దశకు వచ్చిన పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శ్రీరామసాగర్ కాల్వ నీటి సరఫరా నిలిపివేయాలని కోరుతున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

మల్యాల : మల్యాల మండల కేంద్రంలో గురువారం పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని 'ట్రస్మా' రాష్ట్ర మాజీ నాయకులు యాదగిరి శేఖర్‌రావు ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోగ రవిప్రసాద్, శ్రీధర్‌రావు, పి.కిషన్‌రావు, పి.నరేష్, దయానంద్, అనిల్, రాజు, సత్యం, తిరుపతి, విజయ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి

మేడిపల్లి : ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మేడిపల్లి మండలం కట్లకుంట, పోరుమల్ల, మేడిపల్లి, కొండాపూర్, దమ్మన్నపేట, కల్వకోట పాఠశాలల్లో సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. గండి రాజయ్య, టి.నారాయణ, జి.మనోహర్, చిలుక రవీందర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐరన్ లోపంపై అవగాహన కల్పించాలి

జగిత్యాల : ఐరన్ లోపంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.డి.సమియొద్దీన్ అన్నారు. గురువారం నేరెళ్ల ఆరోగ్య కేంద్ర పరిధిలోని వైద్య సిబ్బందికి శిక్షణ శిబిరం నిర్వహించారు. తినే ఆహారంలో ప్రతిరోజు 5 గ్రాముల ఐయోడైజ్డ్ ఉప్పు ఉండేలా చూసుకోవాలని లేనట్లయితే అనేక దుష్ప్రభావాలు కలుగుతాయని అన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు ఐడీ కేటాయించాలి

జగిత్యాల: డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు ఐడీ కేటాయించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిన్‌పల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లా ట్రెజరీ అధికారి సోఫియాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

షెడ్లను ఖాళీ చేయాలి

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లోని డార్మిటరీ షెడ్లలో చాలా ఏళ్లుగా తిష్ఠవేసిన భక్తులను ఖాళీ చేయించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయ అటెండరు ఇద్దరు భక్తురాళ్లతో గొడవకు దిగడంతో పరస్పరం దూషించుకున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో అటెండరు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగి పరిస్థితి నిలకడగానే ఉందని, సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాల్సి ఉందని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సరికాదని బాధితుడితో ఫోన్‌లో మాట్లాడినట్లు ఈవో వివరించారు.

మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, రాయికల్, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని లావోస్ నుంచి తిరిగి వచ్చిన నలుగురు బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జగిత్యాలకు చెందిన అయ్యోరి మోహన్, రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన ఎడ్లపల్లి మహేష్, గాండ్ల అనిల్‌కుమార్, అల్లీపూర్‌కు చెందిన చెలుముల ప్రవీణ్‌కుమార్ రాయికల్ మండలానికి చెందిన ఓ ఏజెంట్‌కు విదేశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం రూ.1.50 లక్షల చొప్పున చెల్లించారు. ఏజెంట్ వారిని లావోస్ పంపించగా అక్కడ కంప్యూటర్ ఆపరేటర్‌కు బదులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం యాప్‌ల ద్వారా భారతీయులను మోసం చేసేందుకు శిక్షణ ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసి తిరిగి వచ్చారు. తమను మోసం చేసిన ఏజెంట్‌పై చర్య తీసుకోవాలని వారు కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 72 మంది లబ్ధిదారులకు రూ.28,04,000 విలువ గల చెక్కులను కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు కోరుట్ల ఏఎంసీ ఛైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు.

క్రీడా పోటీల్లో సత్తా

ధర్మపురి గ్రామీణం: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ బాలికల కబడ్డీ పోటీల్లో మగ్గిడి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 19లో ఉమ్మడి కరీంనగర్‌లో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.



ప్రకృతి వనంలో పచ్చదనం

గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను నాటించారు. చాలా గ్రామాల్లో వనాలు లేకుండా పోయినప్పటికీ సారంగాపూర్ మండలంలోని పెంబట్ల పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో ఏపుగా పెరిగిన మొక్కలతో పచ్చదనం పరచుకుంది. గ్రామానికి దూరంగా అటవీ ప్రాంతానికి సమీపంలో ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఉపయోగ పడకుండా పోయింది. ప్రస్తుతం వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలతోపాటు పలు చెట్లు వృక్షాలుగా మారి నీడ నిచ్చి పచ్చదనం నిండిపోయింది. కొంత కాలంగా నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మండలంలోని లక్ష్మీదేవిపల్లె నుంచి రంగపేట వెళ్లే రహదారి పక్కనే ప్రకృతి వనం ఉండడంతో నిర్వహణ చేపట్టినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, సారంగాపూర్**

అలరించిన శ్రీ నృసింహ ప్రవచనం



బ్రహ్మానంద సరస్వతీ స్వామిని సన్మానిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై గురువారం నైమిశారణ్య పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతీ స్వామి 'శ్రీ లక్ష్మీనరసింహ లీలా విలాసం' ప్రవచనం చేశారు. దేవస్థానానికి చేరుకోగానే ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతో పాటు, అన్ని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన్ని ఘనంగా సన్మానించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రాయికల్: రాయికల్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన బొంబాయి పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తిరుపతిగౌడ్, మోఖిద్, ఆడెపు హరికృష్ణ, తదితరులున్నారు.